www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -134 శుక్రవారం 28 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## మీర్ ఆలం చెరువుకు

# కొత్త హంగులు

**ఫ్యామిలీ టూరిస్టు హబ్ గా అభివృద్ధి..ఆకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి**

**గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలు**

**హైదరాబాద్ ఆగస్టు 27(ప్రజావినికిడి);**
చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు కల్పించాలని యోచిస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మీర్ ఆలం చెరువును గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మీర్ ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని

మిగతా 2లో.



## నేపాల్ వరదవిషాదం

# 300 మంది భారతీయుల గల్లంతు

**విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య**

**సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్**



**ఖాట్మండ్,ఆగస్టు 27(ప్రజావినికిడి);**
నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది.నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది.

మిగతా 2లో.





## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

**కడియంపై వ్యాఖ్యలపై కౌశిక్ రెడ్డికి నోటీసులు**

**కౌశిక్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నంపై వేముల ఆగ్రహం**

**హైదరాబాద్,ఆగస్టు 27(ప్రజావినికిడి);**
హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఆగస్ట్ 29న అసెంబ్లీ కమిటీ హాల్1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా, 'ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని,

మిగతా 2లో.

# మైనింగ్ అధికారిపై ఏసీబీ ఉచ్చు

**డ్రైవర్ ఖాతా నుంచి కుమార్తెకు రూ.24.80 లక్షలు!**

**ఫిర్యాదు నేపథ్యంలో 8 ప్రాంతాల్లో సోదాలు..రూ.3.06 కోట్ల ఆస్తులను గుర్తించాం : ఏసీబీ**

**ఇటీవల ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్న మైనింగ్ ఏడీ బొజ్జ జయరాజ్**

**బోడుప్పల్/భూపాలపల్లిఆగస్టు 27(ప్రజావినికిడి);**
ఆయన ప్రభుత్వ శాఖలో కీలక అధికారి. ఇటీవల ఉత్తమ అధికారిగా పురస్కారం కూడా అందుకున్నారు. కానీ కొద్ది రోజులకే ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ఆయనపై ఏసీబీ కేసు నమోదైంది. గురువారం రాష్ట్రంలోని ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాల్లో సుమారు రూ.3.06 కోట్ల ఆస్తులు వెలుగుచూశాయి. డ్రైవర్ ఖాతా నుంచి ఆయన కుమార్తె ఖాతాకు రూ.24.80 లక్షలు బదిలీ అయినట్టు గుర్తించడం ఈ కేసులో కీలక మలుపు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మైన్స్ అండ్ జియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ, ప్రస్తుతం వరంగల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి

మిగతా 2లో.



## ఖేలో ఇండియా సంవాద్

**దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం**

**క్రీడాకారులకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు**



**న్యూఢిల్లీ,ఆగస్టు 27(ప్రజావినికిడి);**
దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారంనిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అ÷-లథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే

మిగతా 2లో.

## యశోదాలో గవర్నర్‌కు సీఎం పరామర్శ

**హైదరాబాద్,ఆగస్టు 27(ప్రజావినికిడి);**
అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.



# హరీశ్ రావు అరెస్ట్

**హన్మకొండలో బిఆర్‌ఎస్ ధర్న**

**హరీష్ రావు అరెస్ట్‌తో పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు**



**వరంగల్,ఆగస్టు 27(ప్రజావినికిడి);**
బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు,

మిగతా 2లో.

# దూసుకొచ్చిన మృత్యువు

**పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు**

**ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు**

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రులు**

**తోణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు**

**పల్నాడు,ఆగస్టు 27(ప్రజావినికిడి);**
పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.



మిగతా 2లో.

## మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి

**యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు**

**ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు**

**ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ**

**తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్**



**న్యూఢిల్లీ,ఆగస్టు 27(ప్రజావినికిడి);**
లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు.

మిగతా 2లో.

# 300 మంది భారతీయుల గల్లంతు

**మొదటిపేజీ తరువాయి**



వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేందని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాత్మాండూకు పంపింది.

# ఖేలో ఇండియా సంవాద్

**మొదటిపేజీ తరువాయి**

సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి

**మొదటిపేజీ తరువాయి**

నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

# హరీశ్ రావు అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**



కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

# నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిండు శాసనసభలో బడివే, పండబెట్టి తొక్కుతా, బట్టలూడదీసి కొడుతా, మా దగ్గర కండలు తిరిగినోళ్లున్నరు.. బొర్ల వేసి కొడ్తం.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పదికత్తులు లేస్తే మీ తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడుతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందికి రావా? అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై చర్చించి చర్యల సిఫార్సుకు ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటుచేసినట్టు నోటీసు వచ్చిందని, అయితే కౌశిక్ వ్యవహారాన్ని సిఫార్సు చేసిన సమయంలో ఎథిక్స్ కమిటీ మనుగడలో లేదని తెలిపారు. అసలు కమిటీ లేనప్పుడు ఆ వ్యవహారాన్ని ఎలా రెఫర్ చేస్తారని ప్రశ్నించారు. దీనిని బట్టి కక్ష సాధింపు చర్యగా అర్థమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం శ్రీహరి అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ ఆక్షేపించారని తెలిపారు.

# దూసుకొచ్చిన మృత్యువు

**మొదటిపేజీ తరువాయి**

మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢీకొని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర



దిగ్భ్రాం÷-రతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాల రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు హోంమంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉప ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.



క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ.. మృతుల కుటుంబాలకు పల్లా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు ప్రమాద మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడు జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు.

# మీర్ ఆలం చెరువుకు కొత్త హంగులు

ముఖ్యమంత్రికి వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సందర్శన సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవంతో పాటు నీటి నాణ్యతను మెరుగు పరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**వాటర్ స్పోర్ట్స్‌కు డిజైన్**

మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతో పాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం



ప్రత్యేక ఆట స్థలాలు, వినోదం, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారని తెలిపారు.

**ఐలాండ్లకూ కొత్త రూపు**

మిర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్(టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులు పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు.

**జూ పార్కుతో సమగ్ర పర్యాటక అనుసంధానం**

సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు.

**సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతం పురోగతి**

మిర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఆగస్టు 27 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పూర్తి కాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్-కమ్-పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువు పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. చారిత్రక చెరువు, పచ్చని పరిసరాలు, నెహ్రూ జూ పార్కు సమీపం, ఐలాండ్లు, వాటర్ స్పోర్ట్స్, కుటుంబ వినోదం, ఫుడ్‌కోర్టులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జితో మిర్ ఆలం ట్యాంక్‌కు సరికొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. సమగ్ర అభివృద్ధి పూర్తయితే హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మిర్ ఆలం ట్యాంక్ మారనుంది. కుటుంబం మొత్తం ఒకే చోట రోజంతా ప్రకృతి, వినోదం, జలక్రీడలు, విశ్రాంతిని ఆస్వాదించేలా మిర్ ఆలం చెరువును తీర్చిదిద్దనున్నారు.

# మైనింగ్ అధికారిపై ఏసీబీ ఉచ్చు

అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న బొజ్జ జయరాజుపై ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజాము నుంచే సోదాలు ప్రారంభమయ్యాయి. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ లోని ఈస్ట్ హనుమాన్‌నగర్‌లో ఉన్న జయరాజ్ నివాసంతోపాటు భూపాలపల్లి కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయం, సూర్యాపేట, తాండూరు తదితర ప్రాంతాల్లోని బంధువులు, సహచరులకు సంబంధించిన మొత్తం ఎనిమిది ప్రదేశాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మైన్స్ ఏడీ కార్యాలయంలో వరంగల్ ఏసీబీ కార్యాలయం నుంచి వచ్చిన సీఐ ప్రవీణ్‌కుమార్ బృందం సోదాలు నిర్వహించింది. కార్యాలయంలో రికార్డులను క్షుణంగా పరిశీలించింది. ఏసీబీ సోదాల సమయంలో ఏడీ కార్యాలయంలో లేరు. ఆర్ఐ, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌లు మాత్రమే ఉండగా వారి నుంచి వివరాలు సేకరించారు. ఇసుక అక్రమ వ్యవహారంలో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో ఏడీ జయరాజ్ ఇండ్లల్లో, కార్యాలయంతో పాటు పలు చోట్ల సోదాలు జరిగాయి. జయరాజ్ 2024 మార్చి15లో భూపాలపల్లిలో ఏడీగా విధుల్లో చేరారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భూపాలపల్లి జిల్లాలో ఉత్తమ అధికారిగా జయరాజ్ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న కొద్ది రోజులకే ఆయన నివాసాలు, కార్యాలయాలపై ఏసీబీ సోదాలు జరగడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సోదాల్లో బోడుప్పల్‌లో సుమారు రూ.40 లక్షల విలువైన జీ+2 భవనం, హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో రూ.32.81 లక్షల విలువైన ఫ్లాట్‌ను అధికారులు గుర్తించారు. కీసరలోని రెండు ప్లాట్లతో కలిపి మొత్తం ఐదు ప్లాట్లు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ తెలిపింది. రూ.10.03 లక్షలతోపాటు మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71.27 లక్షల నిల్వలు బయటపడ్డాయి. పోస్టాఫీస్ పొదుపు పథకాల్లో రూ.20.86 లక్షలు, ఎల్ఐసీ, మ్యాక్స్ లైఫ్ పాలసీల్లో రూ.19.86 లక్షల పెట్టుబడులను గుర్తించారు. సుమారు రూ.37.23 లక్షల విలువైన 629 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.10.67 లక్షల విలువైన ఇంటి సామగ్రిని కూడా ఆస్తుల జాబితాలో చేర్చారు. సోదాల సందర్భంగా జయరాజ్ డ్రైవర్ సత్తునూరి యాదయ్య మొబైల్ ఫోన్, బ్యాంకు లావాదేవీలను పరిశీలించిన ఏసీబీ అధికారులకు కీలక సమాచారం లభించినట్టు తెలిసింది. డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి జయరాజ్ కుమార్తె ఖాతాకు పలుమార్లు కలిపి రూ.24.80 లక్షలు బదిలీ అయినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఇసుక రవాణా, సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొనే వ్యక్తుల నుంచి డబ్బు సేకరించి అధికారి కుమార్తె ఖాతాకు బదిలీ చేసినట్టు డ్రైవర్ విచారణలో వెల్లడించినట్టు ఏసీబీ పేర్కొంది. అయితే ఈ నగదు లావాదేవీల అసలు మూలం ఏమిటి? ఎందుకు బదిలీ చేశారు? వాటికి అక్రమ లావాదేవీలతో సంబంధం ఉందా? అనే అంశాలపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# రాఖీ బంధం బాలికల భద్రతకు మన ప్రతిజ్ఞ -రాఖీ వేడుకలు..






**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
సంతకాల ప్రచారం రంగారెడ్డి జిల్లా రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళా శిశు సంక్షేమ శాఖ, రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో, బేటీ బచావో- బేటీ పడావో (దీదీద్వీ) కార్యక్రమంలో భాగంగా రాఖీ బంధం బాలికల భద్రతకు మన ప్రతిజ్ఞ" అనే సందేశంతో రాఖీ వేడుకలు సంతకాల ప్రచార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన భారీ రాఖీ ద్వారా ఆడపిల్లల భద్రత, గౌరవం,విద్య, సమానత్వం సురక్షితమైన భవిష్యత్తు పట్ల సమాజం యొక్క బాధ్యతను చాటిచెప్పే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. కార్యక్రమం యొక్క ప్రధాన సందేశం ఈ రాఖీ బంధం సాక్షిగా ఆడపిల్లల భద్రతకు మన సంతకం,ఆమె గౌరవానికి మన హామీ,ఆమె భవిష్యత్తుకు మన భరోసా. రాఖీ కేవలం సోదర-సోదరీమణుల మధ్య ప్రేమకు ప్రతీక మాత్రమే కాకుండా,ప్రతి ఆడపిల్లను రక్షించాలి, గౌరవించాలి, చదివించాలి, సమాన అవకాశాలు కల్పించాలి అనే సామాజిక బాధ్యతకు ప్రతీకగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతకాల ప్రచారంలో జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, మహిళలు, యువత ప్రజలు పాల్గొని బాలికల భద్రత సాధికారతకు తమ మద్దతును సంతకాల ద్వారా తెలియజేశారు. ఆడపిల్లకు రక్షణ కల్పించడం ఒకరి బాధ్యత కాదు సమాజం మొత్తం తీసుకోవాల్సిన బాధ్యత.అనే సందేశంతో ప్రతి ఒక్కరూ బాలికల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ సి. నారాయణ రెడ్డి, ఐ.ఏ.ఎస్. పాల్గొని మాట్లాడుతూ, బాలికలకు సురక్షితమైన గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

బాలికలకు విద్య, భద్రత,సమాన అవకాశాలు ఆత్మవిశ్వాసం కల్పించడం ద్వారా మాత్రమే సమాజం సమగ్ర అభివృద్ధి సాధించగలదని తెలిపారు. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం యొక్క లక్ష్యాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ, బాలికలు పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విద్య ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్(ఎల్ బి) శ్రీమతి కిరణ్మయి కార్యక్రమంలో పాల్గొని బాలికల రక్షణ,విద్య సాధికారత కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాఖీ పండుగను ఒక సామాజిక బాధ్యతకు ప్రతీకగా మలచడం ద్వారా బాలికల భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించవచ్చని తెలిపారు.

అదనపు కలెక్టర్ (రెవిన్యూ) చంద్ర రెడ్డి మాట్లాడుతూ, "బాలికల భద్రత మన బాధ్యత" అని పేర్కొన్నారు. బాలికల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శాంతి శ్రీ మాట్లాడుతూ, బాలికల భద్రత, గౌరవం ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని పిలుపునిచ్చారు. రాఖీ బంధం ద్వారా బాలికల రక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొని కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. బాలికల రక్షణ, విద్య,ఆరోగ్యం, గౌరవం సమానత్వం కోసం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొని కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారి హరీష్ ,ఎ ఒ సునీల్ నాథాని ఐ డి ఓ సి సూపరింటెండెంట్ ట్రెజరీ అధికారి జి. సూర్యనారాయణ,ఇతర ప్రభుత్వ అధికారులు, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సిబ్బంది, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది,ఐసీపి ఎస్ సిబ్బంది, కిశోర బాలికలు మరియు డాన్ బోస్కో హోమ్స్ పిల్లలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..

## టీజీవో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
పిఆర్ సి ప్రకటించాలని , కరువు భత్యం బకాయిలు మంజూరి చేయాలని, నూతన ఆరోగ్య భీమా పథకం సమర్థవంతంగా అమలు చేయాలని ఇతర పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోరుతూ గురువారం రోజు తెలంగాణ ఉద్యోగుల , ఉపాధ్యాయుల , పెన్షనర్ ల జాయింట్ యాక్షన్ కమిటి పిలుపు మేరకు ఇందిరాపార్క్ దగ్గర జరిగిన ధర్నా కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినట్లు టీజీవో అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రభుత్వం గా చెప్పుకుంటున్న ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం , ప్రజలలో భాగమైన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా తాత్సార్యం చెస్తూ ఉద్యోగులను తీవ్ర అశాంతికి గురిచేస్తుందని అయన అన్నారు.

ముఖ్యమంత్రి సూచన మేరకు ఉప ముఖ్యమంత్రి భట్ట విక్రమార్క క్యాబినెట్ సబ్ కమిటీని ,నవీన్ మిట్టల్, ఐఏఎస్ అధికారుల కమిటీని, మంత్రులను ఎన్నో సార్లు కలిసినా సమస్యల పరిష్కారం కావడం లేదని దీనిపై






ఉద్యోగుల రాష్ట్ర ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అయన అన్నారు.

టీజీఈ జేఏసీఇచ్చిన పిలుపుమేరకు ఇందిరాపార్క్ వద్ద జరిగిన మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాధించలేదని, ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం పెండింగులో ఉన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే భవిష్యత్ లో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకొనే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. టీజీఈ జేఏసీ సెక్రెటరీ జనెరల్ శ్రీ ఏలూరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, పిఆర్ సి అమలు,డి ఎ బకాయిల కొరకు ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినప్పటికీ చలనం లేదని, గురువారం రోజు జరిగిన ధర్నా ప్రభుత్వానికి ఒక గట్టి హెచ్చరిక అని,ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను ఒప్పుకోకుంటే , భవిష్యత్తులో తాము తమ పోరాటాన్ని ఉదృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నూతనకంటి వెంకట్,శాంతి శ్రీ, సైదమ్మ,అనిత, రాకేష్, మహేశ్వరి, మసూద్ ఆలీ, నరేందర్,రోజా, శ్రీనివాస్,మహేష్ మరియు జెఏసి భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సింబయోసిస్ సెంటర్ ఫర్ మేనేజ్మెంట్ స్టడీస్ క్యాంపస్ లో జరిగిన ప్రధాన మంత్రి ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమం..

## ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ డీకే అరుణ..

## విశిష్ట అతిథులుగా పాల్గొన్న బ్యాట్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, ముస్కాన్ ఖాన్..






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ క్రీడాకారులను ఉద్దేశించి వర్చువల్ గా ప్రసంగించారు. ఎంపీ డీకే అరుణఖేలో ఇండియా సంవాద్ -ఖేల్ కీ బాత్ పీఎం కే సాత్జాతీయ క్రీడా దినోత్సవల సందర్భంగా నిర్వహించిన 'ఖేలో ఇండియా సంవాద్ - ఖేల్ కీ బాత్ పీఎం కే సాత్' కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది.గ్రామీణ స్థాయిలో యువతలోని క్రీడా ప్రతిభను గుర్తించి,వారిని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా ఒక అద్భుతమైన కార్యక్రమం అని అన్నారు. యువత క్రీడా రంగంలో రాణించడం ద్వారా అనేక అవకాశాలు వస్తాయని, కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటు నుంచి క్రీడలకు పెద్ద పీట వేసిందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న అన్ని పార్లమెంట్ నియోజకవర్గాలలో ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా ఇటీవల మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు పీఎం. సంసద్ ఖేల్ మహోత్సవం లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్,క్రికెట్, అథ్లెటిక్స్ వంటి గ్రామీణ క్రీడలను నిర్వహించామని తెలిపారు. క్రీడ రంగంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు.

మహబూబ్నగర్ నియోజకవర్గ క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు, ఆ విధంగా తీర్చిదిద్దడానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పవన్ కుమార్ రెడ్డి,అందే బాబయ్య,పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి,ముచర్లపల్లి జనార్దన్ రెడ్డి,కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి,నవీన్ రెడ్డి,మహేందర్ రెడ్డి,వంశీ కృష్ణ,తదితరులు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధిలో షాద్‌నగర్ మహిళలు

## జీవన్‌ధార ఫార్మసీని సందర్శించిన జిల్లా మెప్మా పీడీ జి.వెంకట నారాయణ

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**



షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న జీవన్‌ధార ఫార్మసీని రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీ జి. వెంకట నారాయణ గురువారం సందర్శించారు. విజిటింగ్‌లో భాగంగా ఫార్మసీలో అందుబాటులో ఉన్న జనరిక్ మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటు ధరల్లో జనరిక్ మందులు అందిస్తున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. జనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన కల్పించి,వాటిపై ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. జనరిక్ మందులు నాణ్యమైనవే కాకుండా తక్కువ ధరలకు లభిస్తాయని ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా బీపీ, షుగర్, కార్డియాలజీ, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు రెగ్యులర్‌గా మందులు వాడే రోగులకు జనరిక్ మందులు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండటం ప్రయోజనకరమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవన్ ధారా ఇన్చార్జ్ జ్ఞాన ప్రసూన,శైలజ, మెప్మా ఇన్‌చార్జి డీఎంసీ అశోక్, షాద్‌నగర్ మెప్మా డీఈఓ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం..

## షాద్‌నగర్ లోకల్ ఆటో యూనియన్

### కస్టమర్ మర్చిపోయిన బ్యాగ్‌లో రూ.34,000/- ఒక్క రూపాయి కూడా తాకకుండా సురక్షితంగా తిరిగి అప్పగించిన ఆటో డ్రైవర్లు..

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**



షాద్‌నగర్ లోకల్ ఆటోలో ప్రయాణించిన ఓ కస్టమర్ తన బ్యాగ్‌ను ఆటోలోనే మర్చిపోయారు. ఈరోజు ఆ బ్యాగ్‌ను గుర్తించిన ఆటో యూనియన్ సభ్యులు, అందులో రూ. 34,000 నగదు ఉన్నప్పటికీ ఏమాత్రం ఆశపడకుండా నిజాయితీగా కస్టమర్‌కు తిరిగి అప్పగించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టిన షాద్‌నగర్ లోకల్ ఆటో యూనియన్ సభ్యుల నిజాయితీకి పోలీసు అధికారులు, కస్టమర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. డబ్బు కంటే నిజాయితీ గొప్పదని, కష్టపడి సంపాదించుకున్న ప్రతి రూపాయిని గౌరవించాలనే సందేశాన్ని చాటిచెప్పిన షాద్‌నగర్ లోకల్ ఆటో యూనియన్‌కు హ్యాట్సాఫ్ఇలాంటి నిజాయితీగల ఆటో డ్రైవర్ల వల్లే ప్రజల్లో షాద్‌నగర్ లోకల్ ఆటో యూనియన్‌పై మరింత నమ్మకం పెరుగుతోంది.

# శేరిగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాల జాతర



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**ఫరూఖ్‌నగర్ మండలం శేరిగూడెం గ్రామంలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా, నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి భావంతో మహిళలు సంప్రదాయ బోనాలను సమర్పించగా. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, తొట్టేలాటి సాంస్కృతిక కార్యక్రమాలతో శేరిగూడెం గ్రామం మొత్తం ఆధ్యాత్మిక సంతరించుకుందిమహిళలు భక్తి శ్రద్ధ తో బోనాలు ఎత్తుకొని ఉత్సాహంగా బోనాల సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ సందర్భంగా అమ్మవారు ప్రతి కుటుంబం కృపాకటాక్షాలు శేరిగూడెం..గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల ఐకమత్యం గ్రామ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని, ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, కొండం శారద శంకరయ్య గౌడ్,ఉప సర్పంచ్ మల్కయ్య గోవర్ధన్ రెడ్డి,వార్డు సభ్యులు,యువ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారుఅమ్మవారి ఆశీస్సులతో శేరిగూడెం గ్రామం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి పోచారం డివిజన్ కన్వీనర్‌గా సామల సత్తిరెడ్డి

**ఘట్కేసర్,(ప్రజావినికిడి):**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ గా సామల సత్తిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పోచారం డివిజన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో సామల సత్తిరెడ్డి కి ఖదిరేష్ గురుస్వామి చేతుల మీదుగా నియామక బాధ్యతలు అందజేశారు. ఈ సందర్భంగా సామల సత్తిరెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం తో ఇచ్చిన బాధ్యతలకు అనుగుణంగా పోచారం డివిజన్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యకలాపాలను నిర్వహిస్తామని అన్నారు. వినాయక చవితి ఉత్సవాలను అందరిని కలుపుకుని సమిష్టిగా ముందుకు వెళ్లి విజయవంతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కో-కన్వీనర్ భాను యాదవ్, స్థానికులు వెంకట్ రెడ్డి , సామల జగన్ మోహన్ రెడ్డి, నెల్లుట్ల కృష్ణ, ఆకిటి బాల్ రెడ్డి, కొండల్ రెడ్డి, బాలరాజు,శేఖర్ రెడ్డి,విష్ణు, జైపాల్ రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ రెడ్డి,గుండె వెంకటేష్,చెర్ల రాజేందర్ రెడ్డి, అశోక్,గుండె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ఎమ్మెల్యే వీరవల్లి శంకర్ మేనకోడలు వివాహ వేడుక

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖుల హాజరు

### రాణి-శివకుమార్‌ల వివాహ వేడుకకు హాజరై ఆశీర్వదించిన మాజీ జెడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్‌నగర్ ఎమ్మెల్యే, వీర్లపల్లి శంకర్ మేనకోడలు రాణి,శివకుమార్ నూతన దంపతులను మాజీ జెడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి హాజరై ఆశీర్వదించారు. శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్‌లో రాణి, శివకుమార్‌ల వివాహ మహోత్సవం కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితులు ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ జెడ్పిటిసి విశాల శ్రవణ్ రెడ్డి,తిరుపతి రెడ్డి అంజయ్య సరికొండ రమేష్ హాజరై నూతన దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. నూతన దంపతులు పరస్పర అవగాహనతో, ప్రేమానురాగాలతో జీవితాన్ని ఆనందంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

### రాణి-శివకుమార్‌ల వివాహ వేడుకలకు అగ్గనూరు విశ్వం,దంగు శ్రీనివాస్ యాదవ్,కట్ట వెంకటేష్ గౌడ్, ఎడ్లమ్మ రవికుమార్ రెడ్డి, అన్నారం రాములు గౌడ్, అగ్గనూరు కిట్టు హాజరు



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో రాణి శివకుమార్‌ల వివాహ వేడుక శుభకార్యానికి అగ్గనూరు విశ్వం,దంగు శ్రీనివాస్ యాదవ్ కట్టు వెంకటేష్ గౌడ్,ఎడ్లమ్మ రవికుమార్ రెడ్డి, అన్నారం రాములు గౌడ్ అగ్గా నూరు,కిట్టు కిట్టు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్యం జీవితం సంతోషాలతో కొనసాగాలని కోరుకున్నారు. వివాహ వేదికపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,వారిని పలకరించుకున్న సన్నివేశం ప్రత్యేకంగా ఆకట్టుకునివివాహ వేడుకకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయుల సందడితో వివాహ వేడుక సంతోషంగా ఘనంగా జరిగింది

### రాణి -శివకుమార్‌ల వివాహ వేడుకలో పాల్గొన్న నడికుడ రఘునాథ్ యాదవ్



**శంషాబాద్, (ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో రాణి శివకుమార్‌ల వివాహ వేడుక వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నడికుడ రఘునాథ్ యాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధూవరులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని కోరుకున్నారు. వివాహ వేదికపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,నడికుడ రఘునాథ్ యాదవ్ ఆత్మీయంగా కలుసుకుని ఒకరినొకరు చిరునవ్వులతో పలకరించుకున్న సన్నివేశం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. వేదికపై ఇరువురి మధ్య చోటుచేసుకున్న ఈ ఆత్మీయ ఆహ్వాన సన్నివేశం ప్రజా జీవితంలో పరస్పర స్నేహభావంతో, ఆత్మీయతతో మెలగడం ఈ సందర్భంగా కనిపించింది. వివాహ వేడుకకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు మండలం సింగిల్ విండో డైరెక్టర్ పద్మారం వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయుల సందడితో మల్లికా కన్వెన్షన్‌లో వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.

### ఎమ్మెల్యే శంకర్ మేనకోడలు వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**షాద్‌నగర్, (ప్రజావినికిడి):**
షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మేనకోడలు రాణి శివకుమార్ వివాహ వేడుకకు స్థానిక మాజీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడు ఎలుగనమోని అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఆయనతో పాటు ప్రతిపక్షానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తదితరులు వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన దంపతులు రాణి-శివకుమార్‌లను అక్షింతలతో ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

## శ్రీరస్తు.. శుభమస్తు అంటూ నూతన వధూవరులకు సీఎం రేవంత్ రెడ్డి ఆశీర్వాదం..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మేనకోడలు వివాహానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి..**









**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
శంషాబాద్ మల్లికా గార్డెన్‌లో జరిగిన షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్-అనురాధ దంపతుల మేనకోడలు రాణి-శివకుమార్ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబంలో వివాహ వేడుక జరుగుతున్న సందర్భంగా



సీఎం రేవంత్ రెడ్డిని స్వాగతించిన కొత్తూరు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, దళిత నేత విద్యార్థి నాయకుడు జంగారీ రవి తదితరులు..

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆహ్వానం మేరకు సీఎం స్వయంగా వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభిమానులు పెద్ద సంఖ్యలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసేందుకు ఉత్సాహం చూపారు. సీఎం రేవంత్ రెడ్డి వారందరినీ ఆప్యాయంగా పలకరించి, కరచాలనం చేశారు. నూతన వధూవరులు రాణి-శివకుమార్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా శుభాకాంక్షలు తెలియజేసి, వారితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ నేత కాశీనాథ్ రెడ్డి,చెంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## నూతన దంపతులను ఆశీర్వదించిన ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్

**రాణిశివకుమార్ వివాహ వేడుకకు హాజరైన మంత్రి తుమ్మల, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి**

**వధూవరులను ఆశీర్వదించిన జర్నలిస్టులు..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మేనకోడలు రాణి,శివకుమార్ నూతన దంపతులను ప్రముఖ సినీ నిర్మాత,నటుడు



బండ్ల గణేష్ ఆశీర్వదించారు. శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్‌లో జరిగిన వివాహ మహోత్సవానికి బండ్ల గణేష్‌తో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరువివాహ వేడుకకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై రాణి-శివకుమార్ నూతన దంపతులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

**మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఆశీర్వాదం**

స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కూడా వివాహ వేడుకకు హాజరై నూతన





దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల శుభాకాంక్షలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,అనురాధ దంపతులతో పాటు షాద్‌నగర్ సీనియర్ జర్నలిస్టు ఎం.డి. ఖాజాపాషా



(కె.పి.),శ్యామల దంపతులు, స్థానిక జర్నలిస్టులు రాఘవేందర్ గౌడ్, శివకుమార్, సాయినాథ్ రెడ్డి తదితరులు నూతన దంపతులను కలిసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# అన్న చెల్లెళ్ళు - అక్కా తమ్ముళ్ళ ఆప్యాయత, అనురాగం, ప్రేమానుబందాలకు ప్రతీక రక్షాబంధన్

రాఖీ పౌర్ణమి ఒక పండగ మాత్రమే కాదు, అన్నాచెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ల ఆప్యాయత, అనురాగం, ప్రేమానుబంధానికి ప్రతీక.శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున జరుపుకునే ఈ పండుగ ఎంతో విశిష్టత సంతరించుకుందిరాఖీ అంటే రక్ష. తమ సోదరులకు ఎలాంటి ఆపదలు, అవాంతరాలు లేకుండా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరుకుంటు ప్రతి ఆడపడుచు తన అన్నదమ్ములకు కట్టే రక్ష నే రాఖీ అంటారు.తమ శ్రేయస్సు, అభ్యున్నతిని కోరుకునే అక్క చెల్లెళ్లకు రాఖీ పండుగ శుభ సందర్భంలో అన్నదమ్ములు కానుకలు ఇవ్వడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. సృష్టిలో తండ్రి తరువాత స్థానం అన్నదే,అలాగే తల్లి తరువాత స్థానం అక్క లేదా చెల్లిదే. శాశ్వతమైన ఈ బంధాన్ని ప్రతి సంవత్సరం మరింత పటిష్టం చేయడమే రాఖీ పౌర్ణమి అంతరార్థం.

### పురాణ ప్రాశస్త్యం

తోబుట్టువుల మధ్య ఆత్మీయత, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ ప్రస్తావన మన పురాణ, ఇతిహాసాల్లో విశదీకరించారు. వ్యాస మహర్షి రచించిన మహాభారతం ప్రకారం శిశుపాలుని శిక్షించే క్రమంలో శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన క్రమంలో చూపుడు వేలుకు గాయమై రక్తం ధారగా కారుతుండగా అది చూసిన ద్రౌపది వెంటనే తాను ధరించిన పట్టు చీర కొంగును చింపి కృష్ణుని గాయానికి కట్టు కడుతుంది. ద్రౌపది అభిమానంతో చేసిన ఈ పనికి శ్రీకృష్ణుడు తాను ఎల్లవేళలా ద్రౌపదికి అండగా ఉంటానని మాట ఇస్తాడు.ఇచ్చిన మాట ప్రకారం ద్రౌపది ఇచ్చిన చిన్న చీర ముక్క ప్రతిఫలంగా నిండు సభలో ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతున్న సమయంలో ఆమెకు అనేక చీరలు ఇచ్చి ఆమె అభిమానాన్ని కాపాడుతాడు. నాటి నుంచి నేటి వరకు అన్నా చెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా చేతికి నూలు వస్త్రం లేదా దారాన్ని రక్షగా కట్టడం ఆచారంగా మారింది. దీనినే రక్షా బంధన్ గా పిలుస్తారు.

### మరో కథనం

పూర్వం దేవదానవులకు పుష్కర కాలం పాటు భీకర యుద్ధం జరిగింది.ఈ యుద్ధంలో అపజయం పొందిన ఇంద్రుడు తన శక్తులను కోల్పోయి, నిర్వీర్యుడై తన పరివారంతో సహా అమరావతిలో తలదాచుకున్నాడు.మరోవైపు రాక్షసరాజు అమరావతిని దిగ్బంధనం చేస్తున్నాడని తెలుసుకున్న ఇంద్రుని ధర్మపత్ని ఇంద్రాణి తన భర్త నిస్సహాయతకు చింతించి తరుణోపాయం గురించి ఆలోచించి శ్రావణ పౌర్ణమి శుభదినం రోజున లక్ష్మీనారాయణులను,పార్వతి పరమేశ్వరులను పూజించి ఇంద్రునికి రక్ష కడుతుంది.అటు తరువాత సకల దేవతలు కూడా వారు పూజించిన రక్షలను తెచ్చి ఇంద్రునికి కట్టి సమరానికి పంపుతారు. ఇంద్రుడు ఆ యుద్ధంలో విజయం సాధించి త్రిలోకాధిపత్యాన్ని పొందుతాడు.



### బలిచక్రవర్తికి లక్ష్మీదేవి రక్ష

పూర్వం బలిచక్రవర్తి కోరిక మేరకు శ్రీ మహావిష్ణువు పాతాళంలోనే ఉండి పోతాడు. అప్పుడు శ్రీలక్ష్మిదేవి పాతాళానికి వెళ్లి బలి చక్రవర్తికి రక్షాబంధనం కట్టి, తన భర్త అయిన శ్రీ మహా విష్ణువుని తిరిగి వైకుంఠానికి తీసుకువచ్చిందని పురాణాల ద్వారా తెలుస్తోంది.

### వైదిక సంప్రదాయ ఆచరణ

రాఖీ పౌర్ణమి అంటే సోదరసోదరీల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధనం మాత్రమే కాదు. శ్రావణ పౌర్ణమి రోజున కొన్ని వైదిక సంప్రదాయాల్లో ఉపాకర్మను కూడా ఆచరించడం ఆచారం.
ప్రేమ, అనుబంధం, రక్షణకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను దేశవ్యాప్తంగా ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడంతో పాటు శ్రావణ పౌర్ణమికి మన వైదిక సంప్రదాయంలో మరో విశిష్టమైన ప్రాధాన్యత ఉంది.వైదిక సంప్రదాయంలో
శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఉపాకర్మ అనే పవిత్ర సంస్కారాన్ని ఆచరించడం ఆనవాయితీ.

### ఉపాకర్మ

వేదాధ్యయనాన్ని పునఃప్రారంభించే సమయంలో పాటించే వైదిక సంస్కారాన్ని ఉపాకర్మ అంటారు.ప్రాచీన కాలంలో గురుకులాల్లో వేదాలను అభ్యసించే వారికి నిర్ణీత కాలంలో విరామం ఉండేది. అనంతరం పవిత్రమైన సంకల్పంతో తిరిగి వేదాధ్యయనాన్ని ప్రారంభించేవారు. ఈ పునఃప్రారంభానికి సంబంధించిన సంస్కారాన్నే ఉపాకర్మగా పిలుస్తారు. అయితే ఉపాకర్మ అంటే కేవలం కొత్త యజ్ఞోపవీతాన్ని ధరించడం మాత్రమే కాదు. ఇందులో ఋషి స్మరణ,తర్పణం, గాయత్రీ జపం, నూతన యజ్ఞోపవీత ధారణ వంటి అనేక ఆచారాలు ఉన్నాయి.

### రాఖీ ఉపాకర్మల సందేశం ఒక్కటేనా

రక్షాబంధన్, ఉపాకర్మ రెండు వేర్వేరు సంప్రదాయాలకు చెందిన ఆచారాలు అయినప్పటికీ, వాటి వెనుక ఉన్న భావంలో ఒక విశిష్టమైన మర్మం దాగి ఉంది.

### రాఖీ

కుటుంబ బంధాలు, ఆప్యాయతలు, పరస్పర ప్రేమనురాగాలు, రక్షణ బాధ్యతను గుర్తుచేస్తుంది.

### ఉపాకర్మ

ధర్మం,గురువు, ఋషి పరంపర, వేదాధ్యయనం, వైదిక కర్తవ్యాల పట్ల బాధ్యతను గుర్తుచేస్తుంది.
అంటే ఒకటి కుటుంబ బంధాల పట్ల బాధ్యతను, మరొకటి ధర్మం పట్ల బాధ్యతను గుర్తు చేస్తాయి.
ఉపాకర్మ నిర్దిష్ట వైదిక సంప్రదాయాలకు సంబంధించిన సంస్కారం. వేదశాఖ, సూత్రం,కుటుంబ ఆచారం తదితర అంశాలను బట్టి ఆచరణ విధానంలో మార్పులు ఉండవచ్చు. అయితే ఉపాకర్మ చేసే సంప్రదాయం లేకపోయినను, ఈ రోజు మనకు అందించే ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రతి ఒక్కరు తమ జీవితంలో పాటించాలని పండితులు సూచిస్తున్నారు.

### నూతన యజ్ఞోపవీత ధారణ

వైదిక సంప్రదాయంలో యజ్ఞోపవీతం(జంధ్యం) కర్తవ్యబద్ధత, నియమం, ధర్మాచరణకు గుర్తుగా భావిస్తారు. ఉపాకర్మ సందర్భంగా నూతన యజ్ఞోపవీతాన్ని ధరించడం ద్వారా గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుని, ఇకపై మరింత శ్రద్ధతో ధర్మాన్ని ఆచరించాలనే సంకల్పానికి కంకణబద్ధులవుతారు.కాబట్టి ఇది కేవలం ఒక ఆచారం మాత్రమే కాకుండా ఆత్మపరిశీలన, కర్తవ్యస్మరణ, గొప్ప సంకల్పానికి ప్రతీకగా భావిస్తారు.

### రాఖీ పండుగలో దాగి ఉన్న మాధుర్యం

రాఖీ పండుగ సందర్భంగా సోదర, సోదరీమణులు ఒకరినొకరు కలుసుకుని ఆప్యాయత, ప్రేమానురాగాలు పంచుకోవడంలో ఎంతో మాధుర్యం దాగి ఉందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.
అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లకు రక్షణగా ఉండి, తమ ప్రేమానుబంధాలు పంచి ఇవ్వాలనే సదుద్దేశ్యంతో జరుపుకునే ఈ పండుగ వారికి మాత్రమే కాక వారిని కన్న తల్లిదండ్రులకు కూడా ఎంతో ఆనందాన్ని పంచి పెడుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. రాఖీ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొని ఆప్యాయత అనురాగాలు పంచుకోవాలని ఆశిస్తూ.



రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలతో
రవికుమార్ సంతోజు
బడంగ్ పేట, హైదరాబాద్

## ఆనందోత్సవాలతో శ్రీ కంఠమహేశ్వర స్వామికి, గౌడ కులస్తులు బోనాల సమర్పణ..



**నాగోల్,(ప్రజావినికిడి):**నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో కాటమయ్య బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. నాగోల్ గౌడ కులస్తులు కాటమయ్యకు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాగోల్ చౌరస్తా అదేవిదంగా నాగోల్ బొడ్రాయి నుండి ఆలయం వరకు అట పాటలతో డప్పు చప్పుళ్లతో బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి కాటమయ్యకు బోనాలు సమర్పించారు.ఈకార్యక్రమములో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్దం ధనంజయ గౌడ్,బద్దం వెంకటేష్ గౌడ్, ఇంద్రాల రమేష్ గౌడ్,పల్లె సీతారాములు గౌడ్,బద్ధం సంతోష్ గౌడ్,లోకేష్ గౌడ్, నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్చెరుకు ప్రశాంత్ గౌడ్,బద్దం శ్రీధర్ గౌడ్,బద్దం నరేందర్ గౌడ్, చెరుకు చిరంజీవి గౌడ్,కోలన్ చంద్రశేఖర్ ఆజాద్ గౌడ్,నవ చైతన్య యువజన సంఘం మాజీ అధ్యక్షుడు చెరుకు ప్రవీణ్ కుమార్ గౌడ్, నవ చైతన్య ఉత్సవ కమిటీ చైర్మన్ చెరుకు శ్రీధర్ గౌడ్, రావుల శ్రీనివాస్ గౌడ్,బద్దం కృష్ణ గౌడ్,బద్దం శివ శంకర్ గౌడ్, రావుల అరవింద్ గౌడ్,బద్దం ప్రసాద్ గౌడ్ రావుల సాయి కుమార్ గౌడ్,గౌడ్ మహిళా సోదరీమణులు గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఏజెంట్‌ఫోర్స్ సాంకేతికతను ఎంచుకున్న సిఆర్‌ఎం సంస్థ




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):**బ్యాంక్ ఆఫ్ బరోడా అనుబంధ సంస్థ అయిన ఇండియాఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఇండియాఫస్ట్ లైఫ్), సంస్థవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు ఆధారిత మార్పును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఏజెంట్‌ఫోర్స్ సాంకేతికతను ఎంచుకున్నట్లు 1 ఏజెంటిక్ సిఆర్‌ఎం సంస్థ అయిన సేల్స్‌ఫోర్స్ నేడు ప్రకటించింది. అమ్మకాలను పెంచడం, కార్యకలాపాలను మరింత సులభతరం చేయడం కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచడం కోసం ఇండియాఫస్ట్ లైఫ్ సంస్థ తన కీలకమైన ప్రక్రియల్లో విశ్వసనీయమైన కృత్రిమ మేధస్సు ఏజెంట్లను అనుసంధానించనుంది.లీడ్ జనరేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు ఇన్సూరెన్స్ ప్రయాణంలోని అన్ని దశలకు మద్దతు అందించే సమగ్ర సేల్స్‌ఫోర్స్ ప్లాట్‌ఫారమ్‌ను ఆధారంగా చేసుకుని ఈ కార్యక్రమాన్ని చేపడుతోందనీ పేర్కొంది. సేల్స్‌ఫోర్స్‌తో ఇండియాఫస్ట్ లైఫ్ కొనసాగిస్తున్న సహకారంలో ఇది తదుపరి దశగా నిలుస్తుందనీ వెల్లడించింది. మరింత తెలివైన, కస్టమర్-కేంద్రీకృత లైఫ్ ఇన్సూరెన్స్ అనుభవాన్ని అందించాలనే సంస్థ లక్ష్యాన్ని ఈ చర్య మరింత బలోపేతం చేస్తుందనీ పేర్కొంది.

## వీరబైరాన్‌పల్లి పోరాట స్ఫూర్తి ఘట్టం

# భావితరాలకు స్ఫూర్తి

**27 ఆగస్టు 1947న రజాకారుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 118 మంది అమరవీరులు**

**అమరవీరులకు తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ ఘన నివాళులు**

**తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను విస్మరించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు**

**నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి,తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ కన్వీనర్**





**హైదరాబాద్,(ప్రజావినికిడి):** వీరబైరాన్‌పల్లి అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.జిల్లా అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, కమిటీ సభ్యులు కప్పర ప్రసాద్, బీజేపీ అధికార ప్రతినిధి కేవీఎల్ఎన్ రెడ్డి,సురేష్, కార్యక్రమ కన్వీనర్ శ్రీనివాస్, కో-కన్వీనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,
1947 ఆగస్టు 27న రజాకారుల దాడిలో వీరబైరాన్‌పల్లిలో 118 మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. నిజాం, రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని తెలిపారు. రజాకారుల దమనకాండకు వ్యతిరేకంగా రెండు దఫాలుగా దాడులను ఎదుర్కొని వీరబైరాన్‌పల్లి ప్రజలు, అమరవీరులు చూపిన ధైర్యసాహసాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు.1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశ పాలన కొనసాగిందని తెలిపారు. తెలంగాణ ప్రజలపై సాగిన దమనకాండకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో వీరబైరాన్‌పల్లి ఘట్టం విషాదకరమైనదైనా,ప్రజల పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందన్నారు.
వీరబైరాన్‌పల్లి పోరాట ఘట్టంతో పాటు తెలంగాణ విమోచన పోరాటంలోని చారిత్రక సంఘటనలను నేటి, భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నాయకత్వంలో భారత ప్రభుత్వం చేపట్టిన పోలీస్ యాక్షన్ అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

### అధికారం కోసం చరిత్రను విస్మరించారు

తెలంగాణలో అనేక సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాలు తెలంగాణ విమోచన పోరాట చరిత్రకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి విమర్శించారు.ఎంఐఎంకు భయపడి,ఓట్ల కోసం అప్పీజ్మెంట్ రాజకీయాలు చేస్తూ తెలంగాణ ప్రజల గొప్ప పోరాట చరిత్రను మరుగునపరిచారని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, అమరవీరుల చరిత్రను విస్మరించడంబాధాకరమన్నారు.

### సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినోత్సవంగా నిర్వహించాలి

సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించాలని నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం,చరిత్ర గురించి మాట్లాడిన గత పాలకులు అధికారంలో ఉన్న సమయంలో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించేందుకు ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తూ తెలంగాణ విమోచన చరిత్రకు తగిన గౌరవం కల్పిస్తోందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే స్ఫూర్తితో సెప్టెంబర్ 17ను అధికారికంగా ఘనంగా నిర్వహించాలని కోరారు.
తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే అమరవీరుల త్యాగాలు,తెలంగాణ విమోచన పోరాట చరిత్రను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

### చరిత్రను వాస్తవాలతో ప్రజలకు తెలియజేయాలి

మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ, తెలంగాణ విమోచన పోరాట చరిత్రను వాస్తవాలతో ప్రజలకు తెలియజేయడం కోసం బీజేపీ అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తోందన్నారు. అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.
కాపర ప్రసాద్ మాట్లాడుతూ,
తెలంగాణ విమోచన పోరాట చరిత్రను వాస్తవాలు, చారిత్రక ఆధారాలతో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ రాజకీయ పార్టీల పాత్రను కూడా చారిత్రక ఆధారాలతో ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు.
అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను కలిసి వారిని సన్మానించి,వారి త్యాగాలను స్మరించుకున్నారు వీరబైరాన్‌పల్లి పోరాట ఘటనలను చిన్నతనంలో ప్రత్యక్షంగా చూసిన పెద్దలతో మాట్లాడి నాటి పరిస్థితులను తెలుసుకున్నారు.అమరవీరుల కుటుంబాలకు తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని నాయకులు కోరారు.
కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులు,నాటి సంఘటనలను ప్రత్యక్షంగా చూసిన పెద్దలు,బీజేపీ గ్రామ పెద్దలు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
వీరబైరాన్‌పల్లి అమరవీరుల త్యాగం చిరస్మరణీయం.వారి పోరాట స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకం.తెలంగాణ విమోచన చరిత్రను ఎవరూ మరుగునపరచలేరు.

# షాద్ నగర్ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం..

## షాద్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విద్యార్థుల రక్షాబంధన్.

## ఆడపిల్లలను పుట్టనిద్దాం, చదవనిద్దాం, -ఎదగనిద్దాం నినాదంతో రక్షాబంధన్ కార్యక్రమం..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** విద్యార్థులకు ఎప్పుడు పోలీస్ వాళ్ళను వారు చేసే పనులను గౌరవిస్తూనే ఉంటారు మాకోసం ఎప్పుడు కష్టపడే మీకు మేము తోడుగా ఉంటాము సమాజం లో మున్సిపాలిటీ కార్మికుల శ్రమ మరువలేనిది అని వారు ముందస్తు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పోలీసు సిబ్బందికి మరియు మున్సిపాల్ కార్మికులకు రాఖీలు కట్టి,రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజల రక్షణ,శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు మరియు మున్సిపాల్ కార్మికులు అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడారు. పండుగలు,ప్రత్యేక సందర్భాల్లో కూడా విధుల్లో ఉంటూ ప్రజలకు భద్రత పరిశుభ్రత కల్పిస్తున్న వీరి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆత్మీయతకు ప్రతీక అని, పోలీసు సిబ్బందితో మున్సిపాల్ కార్మికుల పట్ల సోదరభావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు నాయకులు తెలిపారు. సమాజంలో శాంతి,భద్రత కోసం పోలీసులు మరియు పరిశుభ్రత కోసం మున్సిపాల్ కార్మికులు చేస్తున్న కృషికి కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు ఆదిల్,రామ్ చరణ్,శివ వంశీ, విష్ణు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.



# వరదలతో తీవ్రంగా ప్రభావితమైన నేపాల్‌కు భారత్ సహాయం



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** తన పొరుగు దేశాలకు ప్రాధాన్య' విధానానికి భారత్ మరోసారి తన నిబద్ధతను చాటుకుంది. సంక్షోభ సమయాల్లో నేపాల్‌కు మొదటి స్పందనదారు గా అందిస్తున్న దీర్ఘకాలిక సహాయాన్ని కొనసాగిస్తూ, వరదలు, కొండచరియలు విరిగిపడటంతో తీవ్రంగా నష్టపోయిన నేపాల్‌కు భారత్ తక్షణ సహాయం అందించింది. ఈ విపత్తు నుంచి నేపాల్ కోలుకునేందుకు తోడ్పడే ఉద్దేశంతో, ఆగస్టు 26న భారత్ 10 టన్నుల మానవతా సహాయం, విపత్తు సహాయ సామగ్రి, ప్రాణరక్షక ఔషధాలతో కూడిన తొలి సరుకును కాఠ్‌మాండూకు పంపించింది. అనంతరం ఆగస్టు 27న భారత వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో 37.5 టన్నుల సహాయ సామగ్రితో కూడిన రెండో భారీ సరుకును నేపాల్‌కు పంపించింది.ఈ కష్టకాలంలో పొరుగు దేశానికి తక్షణ సహాయం అందిస్తూ భారత్ తన మానవతా, విపత్తు సహాయ నిబద్ధతను మరోసారి చాటుకుంది.విపత్తు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, విదేశాంగ మంత్రిత్వ శాఖ తన దౌత్య, పరిపాలనా యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో అప్రమత్తం చేసింది.ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఆగస్టు 27న న్యూఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశ వివరాలను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్ ద్వారా వెల్లడించిన జైశంకర్,నేపాల్ వరద విపత్తుపై విదేశాంగ కార్యదర్శి, విదేశాంగ మంత్రిత్వ శాఖ బృందం అలాగే కాఠ్‌మాండూ, బీజింగ్‌లోని మన రాయబారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న భారతీయులందరి పరిస్థితి,క్షేమం గురించి తెలుసుకునేందుకు అత్యవసర చర్యలు కొనసాగుతున్నాయ అని తెలిపారు.

# అమ్మవారి కృపతో అందరి జీవితాలు ఆనందమయం కావాలి

## ఇప్పలపల్లి గ్రామంలో మైసమ్మ బోనాల మహోత్సవం - హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**కేశంపేట,(ప్రజావినికిడి):** మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో జరుగుతున్న మైసమ్మ బోనాల మహోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారుఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి కృపతో అందరి జీవితాలు ఆనందమయం కావాలని,అమ్మవారి చల్లని చూపు మనందరిపై సదా ఉండాలని,ప్రతి ఒక్కరి ఇంటా సరికొత్త వెలుగులు నిండాలని,అందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాని అకాక్షించారు.ఈ కార్యక్రమంలో ఇప్పలపల్లి సర్పంచ్ మంద మంజుల జంగయ్య,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,లింగందాన సర్పంచ్ నాగిల వెంకట్,కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,మాజీ సర్పంచులు ఆంజనేయులు యాదవ్,తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్లు సహదేవ్,నరేందర్ రెడ్డి,వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యగా ఉన్న కాలువ నిర్మాణం పైప్‌లైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి)**ఎల్బీనగర్ నియోజకవర్గ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేతుల మీదుగా శారదానగర్ కాలనీ ఫేస్-3లో ప్రధాన సమస్యగా ఉన్న కాలువ నిర్మాణం అలాగే పైప్‌లైన్ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సహకారం అందించడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ పనులు సకాలంలో పూర్తయితే పైనుంచి వచ్చే వరద నీటి నుంచి పూర్తిస్థాయిలో కాలనీవాసులకు విముక్తి లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శారదానగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ప్రదీప్ రావు,సీనియర్ భారస నాయకులు దీపావళి శ్రవణ్ కుమార్,గుత్తా లక్ష్మణ్ రెడ్డి,దీపావళి శ్రీకాంత్ కార్యవర్గ సభ్యులు,కాలనీ పెద్దలు,శ్రేయోభిలాషులు,మహిళా విభాగం సభ్యులు కాలనీవాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో.. రక్షాబంధన్ వేడుకలు,సీఐ సీతారాంకు రాఖీ కట్టిన మహిళలు

## పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి,స్వీట్లు పంపిణీ



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో పోలీసు అన్నయ్యలకు ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.బీజేవైఎం అసెంబ్లీ ఇన్‌చార్జ్ పుట్నాల సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సీతారాంకు బీజేవైఎం నాయకులు ముందస్తు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి,స్వీట్లు అందించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల రక్షణ,శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడారు.పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో కూడా విధుల్లో ఉంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆత్మీయతకు ప్రతీక అని, పోలీసు సిబ్బందితో సోదరభావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బీజేవైఎం నాయకులుతెలిపారు. సమాజంలో శాంతి,భద్రత కోసం పోలీసులు చేస్తున్న కృషికి కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు వివేక్, విజయ్,ప్రశాంత్,రాధిక, నందిని,పూజ,ఫలక్,మనోజ్ఞ, శ్రేయ,హారిక, సరిత,నందిని, శ్రీనిధి,శ్రీజతో పాటు బీజేవైఎం నాయకులు,కార్యకర్తలు, షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పెద్ద షాపూర్‌లో యూనిఫాం స్టిచింగ్ సెంటర్ పరిశీలించిన అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి.






**శంషాబాద్,(ప్రజావినికిడి);** మండలంలోని పెద్ద షాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న యూనిఫాం స్టిచింగ్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి గురువారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా యూనిఫాం కుట్టే విధానం,అందుబాటులో ఉన్న సౌకర్యాలు,సిబ్బంది పనితీరు తదితర అంశాలను ఆమె పరిశీలించారు. యూనిఫాం స్టిచింగ్ సెంటర్ నిర్వహణ, యూనిఫాం నాణ్యత, సమయానుసారం కుట్టుపని పూర్తి చేసే విధానంపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను నిర్ణీత సమయంలో అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్,సంబంధిత అధికారులు,సిబ్బంది ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ బుకింగ్ వివరాలు నమోదు చేసుకోవాలి



**భీమదేవరపల్లి/ఆగస్టు27 (ప్రజావినికిడి);** వానాకాలం సాగు వివరాలను నమోదు చేసేందుకు మండలంలో డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతోందని మండల వ్యవసాయ అధికారి పద్మ తెలిపారు. ఇందులో భాగంగా వాలంటీర్లు ప్రతి పంట పొలం వద్దకు వెళ్లి సర్వే నంబర్ వారీగా పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు పేరు, పంట రకం, విత్తన రకం, సాగు విస్తీర్ణం తదితర వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వాలంటీర్లు తమ పొలాల వద్దకు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి పంట వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. డిజిటల్ క్రాప్ బుకింగ్‌లో నమోదైన వివరాల ఆధారంగానే సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ అందజేయనున్నట్లు తెలిపారు. పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోని రైతులకు పంట విక్రయ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు వాలంటీర్లు వచ్చినప్పుడు తమ పంట వివరాలను పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మ కోరారు.

# ఓటర్ల జాబితా సవరణ: ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

**హైదరాబాద్ ఆగస్టు 27(ప్రజావినికిడి);** తప్పుడు సమాచారమిస్తే జైలు శిక్ష తప్పదని స్పష్టం తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన ఆయన స్పష్టం చేశారు.ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ




సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు.విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మంచుకొండల్లో మహా విలయం



## ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యం

**ఆగస్టు 27(ప్రజావినికిడి):**
నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి.

ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది. ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల



గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉద్ధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిందని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంతయ్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది. ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పుడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది. బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగీ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి. ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగీ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది. మధ్యాహ్నం ఒంటిగంటకు చైనా నుంచి నేపాల్‌కు సమాచారం అందింది. టిబెట్ వైపు నదిలో కొండచరియలు విరిగి పడటంతో.. భోటేకోషీ, త్రిశూలి నదులకు ముప్పు ఏర్పడిందనేది దాని సారాంశం. టిబెట్‌లో వరదల గురించి బీజింగ్ ముందుగానే తెలుసుకున్నా.. ఆ విషయాన్ని చేరవేయకపోవడంతో పెను నష్టం వాటిల్లినట్లు నేపాల్ ఆరోపిస్తోంది. అయితే, ఈ విపత్తును చైనాను బాధ్యులను చేయలేమని, ఇరు దేశాల మధ్య ఆ ఒప్పందం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

# రాఖీ పౌర్ణమి..అన్నా చెల్లెళ్ల ప్రేమకు ప్రతీక

**హైదరాబాద్,ఆగస్టు 27(ప్రజావినికిడి):**
'రక్ష' అనగా రక్షణ, 'బంధన్' అనగా కట్టడం. సోదరి తన సోదరుని క్షేమంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ చేతికి రాఖీ కడుతుంది. హామీ: సోదరుడు ఎల్లప్పుడూ తనకు అండగా ఉంటానని, రక్షణగా నిలుస్తానని సోదరీమణులకు మాటిస్తాడు. హిందూ చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం, శ్రావణ మాసం పౌర్ణమి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. దీనిని కొన్ని ప్రాంతాలలో 'జంధ్యాల పౌర్ణమి' అని కూడా పిలుస్తారు, ఎందుకంటే ఈ రోజే జంధ్యం ధరించేవారు కొత్త జంధ్యాన్ని మారుస్తారు. హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ వేడుక సోదర, సోదరీమణులకు మధ్య ప్రేమకు గుర్తుగా పేరుగాంచింది. రాఖీ కట్టిన తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రాఖీకట్టి స్వీటు తినిపించి, హారతినిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. శుక్రవారం అక్కాతమ్ముళ్లు ఆనందోత్సవాల మధ్య పండుగను జరుపుకోనున్నారు. ఈ రాఖీ పర్వదినంపై నాటి నుంచి నేటి వరకు అనేక పురాణాలు, కథలు



ప్రచారంలో ఉన్నాయి. సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు ఎంతో రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. మార్కెట్‌లో రుద్రాక్ష, స్టోన్, వెండి, బంగారు రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుందన్‌లు, మెరుపులు జరీతో పాటు స్పాంజితో తయారు చేసిన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. పిల్లలను ఆకర్షించేందుకు కార్టున్ రాఖీలు కూడా వచ్చాయి.పాతకాలంలో అతిపెద్దగా ఉండే రాఖీలు ధరించేవారు. రానురాను అవి చిన్నగా మారిపోయాయి. మళ్లీ ఈ సంవత్సరం మార్కెట్‌లోకి పెద్దపెద్ద రాఖీలు దుకాణాల్లో దర్శనిమిచ్చాయి.

ఈనెల 28న సూర్యోదయం నుంచి సూర్యస్తమయం వరకు సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టుకోవచ్చని వేద పండితులు చెబుతున్నారు.

# వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

### భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు

**వాషింగ్టన్,ఆగస్టు 27(ప్రజావినికిడి):**
అమెరికాలో చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని లేదా అక్కడే కెరీర్ కొనసాగించాలని భావిస్తున్న భారతీయులకు మరోసారి అనిశ్చితి ఎదురైంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసి రీషెడ్యూల్ చేయనున్నట్టు అమెరికా తాజాగా ప్రకటించింది. అమెరికా కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న



నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసు కున్నాయి .వీసా దరఖాస్తుదారులను మరింత క్షుణ్ణంగా పరిశీలించడం, ముఖ్యంగా వారు అమెరికా ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందా అనే అంశాన్ని అంచనా వేయడంపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ శిక్షణ కోసం కొన్ని వీసా అపాయింట్ మెంట్లను మార్చుతున్నారు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన కొంతమంది దరఖాస్తుదారులకు కూడా అపాయింట్‌మెంట్లు రద్దు చేసి, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని సమాచారం అందించారు ఇటీవలి కాలంలో అమెరికాలో హెచ్-1బీ ఆమోదాల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైగా ఉంది. ప్రస్తుతం అమెరికా యూనివర్సిటీలలో 3,30,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందువల్ల వీసా ఇంటర్వ్యూ తేదీలో ఆలస్యం విద్యార్థుల యూనివర్సిటీ జాయినింగ్ తేదీలను, ఉద్యోగుల జాబ్ ఆఫర్లు, రీలొకేషన్ ప్లాన్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు లేదా హెచ్-1బీ వర్క్ వీసాల జారీని పూర్తిగా నిలిపివేయలేదు. అపాయింట్‌మెంట్ షెడ్యూలింగ్‌లో అంతరాయం మాత్రమే ఏర్పడుతోంది. అమెరికా ఇప్పటికీ భారతీయ విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులకు ముఖ్యమైన గమ్యస్థానంగానే ఉంది. అయితే వీసా స్క్రీనింగ్, హెచ్-1బీ ఖర్చులు, ఎంపిక విధానం, ఎఫ్-1 నిబంధనలు, అపాయింట్‌మెంట్ టైమ్‌లైన్లలో మార్పులు రావడంతో అమెరికా వెళ్లే ప్రణాళిక గతంలో కంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఏర్పడింది.

# 'ఇరుముడి' వివాదం.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన ఉపాధ్యాయులు!

**అమరావతి,ఆగస్టు 27(ప్రజావినికిడి):**
ప్రముఖ నటుడు రవితేజ కథానాయకుడిగా నటించిన 'ఇరుముడి' చిత్రంపై తీవ్ర వివాదం రాజుకుంది. ఈ సినిమాలో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులను కించపరిచేలా కొన్ని సన్నివేశాలు ఉన్నాయంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు అందింది. ఏపీ ప్రాథమికోపాధ్యాయ సంఘం (ఏపీటీఏ) ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. అటు, ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బోరా గోపి మూర్తి ఇరుముడి చిత్రంలోని కొన్ని సన్నివేశాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సినిమాలోని ఆక్షేపణీయ సన్నివేశాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్‌కు వారు విజ్ఞప్తి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఎమ్మెల్సీ గోపి మూర్తి మీడియా సమావేశంలో మాట్లాడుతూ సినిమాలోని అంశాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలోని ఓ జడ్పీ బాలికల ఉన్నత



పాఠశాలలో ఈ సినిమాను చిత్రీకరించారని, కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాలికల యూనిఫామ్‌ను సినిమాలో చూపించారని తెలిపారు. ఓ మహిళా ఉపాధ్యాయురాలిని అత్యంత క్రూరంగా, ప్రతికూల స్వభావంతో చిత్రీకరించారని ఆరోపించారు. స్పెషల్ క్లాసుల పేరుతో ఓ విద్యార్థినిని ఎమ్మెల్యే వద్దకు పంపే సన్నివేశం అత్యంత దారుణంగా ఉందని, ఇది ప్రజాప్రతినిధులపై కూడా తప్పుడు అభిప్రాయం కలిగించేలా ఉందని విమర్శించారు.

పాత్రలు కల్పితమైనప్పటికీ, ప్రభుత్వ పాఠశాల వాతావరణంలో, ప్రభుత్వ యూనిఫామ్స్‌తో చిత్రీకరించడం వల్ల సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని గోపి మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. సినిమా అనేది శక్తిమంతమైన మాధ్యమమని, దర్శక, నిర్మాతలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల పట్ల సామాజిక బాధ్యత ఉండాలని హితవు పలికారు. ఉపాధ్యాయులను కించపరచడం విద్యను అవమానించడమేనని, ప్రభుత్వ బడులను చులకనగా చూపడం లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎన్నో సవాళ్ల మధ్య పేద విద్యార్థులకు విద్యనందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులందరినీ అవమానించేలా ఈ చిత్రీకరణ ఉందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించి, సినిమా నుంచి వివాదాస్పద సన్నివేశాలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నేపాల్ వరదల్లో ఏపీ యాత్రీకుల వివరాలు సేకరిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం.

### తెలుగు వారి క్షేమ సమాచారాన్ని సేకరిస్తోన్న ఆర్టీజీఎస్.

**అమరావతి,ఆగస్టు 27(ప్రజావినికిడి):** :మానస సరోవర యాత్రకు వెళ్లి చిక్కుకున్న వారిలో తెలుగు వారు... ప్రత్యేకించి ఏపీ వాసులు ఎవరైనా ఉన్నారని అధికారులు ఆరా తీస్తున్నారు. మానస సరోవర యాత్రను నిర్వహించే వివిధ టూరిస్ట్ సంస్థలు, ఏజెన్సీలతో మాట్లాడుతున్న అధికారులు, తిరుపతికి చెందిన 28 మందితో కూడిన యాత్రీకుల బృందం ఖాట్మాండులో ఉన్నట్టు గుర్తించారు.




ఖాట్మాండులోని యెల్లకొండ వద్ద ఒక హోటల్ లో తిరుపతి యాత్రీకుల బృందం బస చేసారు. యాత్రీకుల క్షేమ సమాచారాన్ని తెలుసుకున్న ఆర్టీజీఎస్ అధికారులు, ఎలాంటి సహయం అవసరమైన తక్షణం తమను సంప్రదించాలని యాత్రీకులకు సూచనలు చేసారు. తామందరం క్షేమంగానే ఉన్నామని... తమను సంప్రదించినందుకు ధన్యవాదాలు తెలిపిన యాత్రీకులకు, మళ్లీ ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే ప్రమాదం ఉందనే హెచ్చరికలు ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచించారు.




# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్

## భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ. 2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది. ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది. 'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ. 100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.

# రంగస్థలంను మించి

## మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ



టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.

# రకుల్ నోట శూర్పణఖ కథ.. తెలియని విషయాలు బయటపెట్టిన నటి!



రామాయణంలో శూర్పణఖ అంటే చాలామందికి వెంటనే గుర్తుకొచ్చేది ప్రతినాయకురాలి పాత్రే. కానీ, 'రామాయణ' చిత్రంలో తాను పోషిస్తున్న శూర్పణఖ పాత్రలో అంతకుమించిన కోణాలున్నాయని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. ఆ పాత్రలోని అనేక అంశాలు తనను ఈ సినిమా వైపు ఆకర్షించాయని తెలిపింది. రావణుడి సోదరిగా శూర్పణఖ పాత్రలో రకుల్ కనిపించనుంది. లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఆమె ఒకరని చెబుతారని రకుల్ గుర్తుచేసుకుంది. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ.. పాత్రలో చాలా కోణాలున్నాయని చెప్పింది. నటిగా అలాంటి పాత్రలను ఆవిష్కరించడం ఆసక్తికరంగా ఉంటుందని తెలిపింది. స్క్రిప్ట్ చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని విషయాలు చాలానే ఉన్నాయని రకుల్ చెప్పింది. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణామాలను సినిమాలో కొత్త కోణంలో చూపిస్తున్నట్లు వెల్లడించింది. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుందన్న విషయాల్లోనూ కొత్త అంశాలు తెలుసుకున్నానని తెలిపింది. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. 'రామాయణ: పార్ట్-1' 2026 నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# నటుడు నారాయణరావు కన్నుమూత



ప్రముఖ నటుడు జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయమైన ఆయన.. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు.. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు. కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లులో సాగింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్.కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బీన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర తదితర నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల తదితరులు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి.సీరియళ్లలోనూ నారాయణ రావు నటించారు.

-----------------

# రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు




రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు. తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది.




# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో

అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ డియోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613